మిస్టర్ బచ్చన్‌ని ఢీకొనే పాత్రలో..

బ్లాక్‌బాస్టర్ 'మిరపకాయ్' తర్వాత రవితేజ, హరీశ్‌శంకర్ కలిసి పనిచేస్తున్న చిత్రం 'మిస్టర్ బచ్చన్'. 'నామ్ తో సునాహోగా' ఉపశీర్షిక. ఈ సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. తాజాగా ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో జగపతి బాబు కూడా భాగమయ్యారు. ఈ సినిమాలో ఆయనది అత్యంత శక్తిమంతమైన పాత్ర అని చిత్రయూనిట్ ప్రకటించింది. ఇందులో భాగంగా ఆయన ఫస్ట్‌లుక్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో జగపతిబాబు ఇంటెన్స్, ఫెరోషియస్ లుక్‌లో కనిపిస్తున్నారు. చెస్ మూవ్‌ని చేతిలో పట్టుకొని సీరియస్‌గా చూస్తున్న ఆయన లుక్‌పై ప్రశంసల వర్షం కురుస్తున్నదని మేకర్స్ చెబుతున్నారు. రవితేజ, జగపతిబాబు కాంబినేషన్ కనుల పండువగా ఉంటుందని, ఇద్దరి పాత్రలూ పవర్‌ఫుల్‌గా ఉంటాయని హరీశ్‌శంకర్ అన్నారు. ఇప్పటికే 80శాతం చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని వీలైనంత త్వరగా విడుదల చేయడానికి నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: అయనంక బోస్, సంగీతం: మిక్కీ జె.మేకర్. నిర్మాత: టీజీ విశ్వప్రసాద్.

రూలింగ్‌కు సన్నాహాలు

'పుష్ప'తో పాన్ ఇండియా ఇమేజ్‌తోపాటు జాతీయ ఉత్తమ నటుడిగా అవతరించాడు అల్లు అర్జున్. దర్శకుడిగా సుకుమార్‌కీ, కథానాయికగా రష్మికకు ఈ సినిమా దేశవ్యాప్త గుర్తింపును తెచ్చిపెట్టింది. ఆగస్ట్ 15న ఈ చిత్రానికి సీక్వెల్ అయిన 'పుష్ప -2 ది రూల్' విడుదల కానున్న విషయం తెలిసిందే. ప్రపంచవ్యాప్తంగా ఆకాశమే హద్దుగా ఈ సినిమాపై అంచనాలున్నాయి. సోమవారం అల్లు అర్జున్ పుట్టిన రోజు. ఈ సందర్భంగా ఈ చిత్రం టీజర్‌ని విడుదల చేయనున్నట్టు మేకర్స్ ప్రకటించారు. దీనికి సంబంధించిన అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ని ఆదివారం విడుదల చేశారు. ఈ స్టిల్‌లో ఫెరోషియస్‌గా, పవర్‌ఫుల్‌గా ఉన్న బన్నీని చూడొచ్చు. ఈ ఏడాది అల్లు అర్జున్‌కి బాగా కలిసొచ్చిందనే చెప్పాలి. ఈ ఏడాదే ఆయన జాతీయ ఉత్తమనటుడిగా అవార్డు అందుకున్నారు. ఈ ఏడాదే ఆయన మైనపు విగ్రహాన్ని దుబాయ్‌లో ఏర్పాటు చేశారు. ఈ ఏడాదే 'పుష్ప-2' కూడా రానుంది. ఈ సినిమాతో మరోసారి ఆయన నట విశ్వరూపం చూస్తారని మేకర్స్ చెబుతున్నారు. రష్మిక మందన్న కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో ఫహాద్ ఫాజిల్, ధనుంజయ్, సునీల్, అనసూయ భరద్వాజ్ ఇతర పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి కెమెరా: మిరోస్లా క్యూబా బ్రోజెక్, సంగీతం: దేవిశ్రీప్రసాద్, నిర్మాతలు: నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్, దర్శకత్వం సుకుమార్.బి.

అక్టోబర్‌లో వెట్టయన్

70ప్లస్‌లోనూ విరామం లేకుండా సినిమాలు చేస్తున్నారు రజనీకాంత్. చిన్న చిన్న స్టార్‌హీరోలే ఏడాదికి ఒక సినిమాతో సరిపెడుతుంటే.. సూపర్‌స్టార్ అయ్యుండి ఏడాది లోపే రెండు సినిమాలు విడుదల చేసి, మూడో సినిమాను కూడా చకచకా కానిచ్చేస్తున్నారు తలైవా. గత ఏడాది ఆగస్ట్‌లో ఆయన 'జైలర్'గా చేసిన హంగామా గురించి ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. ఈ ఏడాది ఫిబ్రవరి 9న 'లాల్ సలామ్'తో వచ్చారు. ప్రస్తుతం టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో 'వెట్టయన్' చేస్తున్నారు. ఈ చిత్ర నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ తాజాగా 'వెట్టయన్' విడుదలపై క్లారిటీ ఇచ్చింది. అక్టోబర్‌లో సినిమాను విడుదల చేయనున్నట్టు ప్రకటించింది. ఈ విషయాన్ని వెల్లడిస్తూ సరికొత్త పోస్టర్‌ను కూడా మేకర్స్ విడుదల చేశారు. గన్ పట్టుకొని, కళ్లద్దాలతో స్టైలిష్‌గా రజనీకాంత్ పోస్టర్‌లో కనిపిస్తున్నారు. అమితాబ్ బచ్చన్, ఫాహద్ ఫాజిల్, దగ్గుబాటి రానా మంజు వారియర్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రంలో రావురమేశ్, రోషిణి మొల్లేటి, రితికా సింగ్, దుషార విజయ్ ఇతర పాత్రధారులు. అనిరుధ్ రవిచంద్రన్ స్వరాలందిస్తున్నారు.

ఎమోషనల్ థ్రిల్లర్

వరలక్ష్మీ శరత్‌కుమార్ ప్రధానపాత్రలో నటించిన పాన్ ఇండియా చిత్రం 'శబరి'. అనిల్ కాట్జ్ దర్శకుడు. మహేంద్రనాథ్ కూండ్ల నిర్మాత. మే 3న సినిమా విడుదల కానుంది. 'ఇదో స్ట్రాంగ్ ఎమోషనల్ థ్రిల్లర్. కథ, కథనాలు కొత్తగా ఇన్నోవేటివ్‌గా ఉంటాయి. వరలక్ష్మీశరత్‌కుమార్ కెరీర్‌లోనే భిన్నమైన సినిమా అని చెప్పొచ్చు. ఇందులో ఆమె నటన అద్భుతం అనిపిస్తుంది. తమిళ వెర్షన్ ఫస్ట్‌కాపీ చూశాం. చాలా బావుంది. తెలుగు, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో పోస్ట్ ప్రొడక్షన్ పనులు సైతం పూర్తయ్యాయి. అన్ని వర్గాల ప్రేక్షకులకూ నచ్చే ఈ సినిమాను మే 3న విడుదల చేయనున్నాం' అని నిర్మాత చెప్పారు. గణేశ్ వెంకట్రామన్, శశాంక్, మైమ్ గోపి, సునయన, రాజశ్రీ నాయర్, మధు నందన్, రషిక బాలి, వైవా రాఘవ, ప్రభు తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: రాహుల్ శ్రీవాత్సవ, నాని చమిడిశెట్టి, సంగీతం: గోపీ సుందర్, సమర్పణ: మహర్షి కూండ్ల, నిర్మాణం: మహా మూవీస్.

మహిళారైతు గంగమ్మ

కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ నేపథ్యంలో జరిగిన యథార్థ సంఘటనల ఆధారంగా రూపొందుతోన్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'తంగలాన్'. చియాన్ విక్రమ్ కథానాయకుడిగా రూపొందుతోన్న ప్రతిష్టాత్మమైన పాన్ ఇండియా సినిమా ఇది. పా.రంజిత్ దర్శకుడు. పార్వతీ తిరువోతు, మాళవిక మోహనన్ కథానాయికలు. పా.రంజిత్ నీలమ్ ప్రొడక్షన్స్‌తో కలిసి స్టూడియో గ్రీన్ పతాకంపై జ్ఞానవేల్ రాజా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. పార్వతి తిరోవోతు పుట్టినరోజు సందర్భంగా 'తంగలాన్'లో ఆమె నటిస్తున్న గంగమ్మ పాత్ర ఫస్ట్‌లుక్‌ను ఆదివారం మేకర్స్ విడుదల చేశారు. మహిళారైతుగా ఇందులో ఆమె నటిస్తున్నట్టు ఆ లుక్ ద్వారా తెలుస్తున్నది. ఇప్పటికే ఈ సినిమా ప్రచార చిత్రాలకు మంచి స్పందన వచ్చిందని, చియాన్ విక్రమ్ పాత్ర సినిమాకు హైలైట్‌గా నిలుస్తుందని, ఇందులో ఆయన పాత్రచిత్రణ విభిన్నంగా ఉంటుందని, కొత్త నేపథ్యంలో, వైవిధ్యమైన కథాంశంతో పా.రంజిత్ సినిమా తెరకెక్కిస్తున్నారని, త్వరలోనే సినిమాను విడుదల చేస్తామని నిర్మాత తెలిపారు. పశుపతి, హరికృష్ణన్, అన్బుదురై తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జి.వి.ప్రకాశ్‌కుమార్.

సారంగదరియా సంగీతం



రాజా రవీంద్ర ప్రధానపాత్రలో రూపొందుతోన్న చిత్రం 'సారంగదరియా'. పద్మారావు అబ్బిశెట్టి దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఉమాదేవి, శరత్‌చంద్ర నిర్మాతలు. పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉన్న ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా ఈ చిత్రంలోని 'అందుకోవా..' అంటూ సాగే గీతాన్ని నటుడు నవీన్‌చంద్ర విడుదల చేసి, చిత్రయూనిట్‌కు శుభాకాంక్షలు అందించారు. రాంబాబు గోశాల రాసిన ఈ గీతాన్ని ఎం.ఎబెనెజర్ పాల్ స్వరపరచగా, విఖ్యాత గాయని కె.ఎస్.చిత్ర ఆలపించారు. లక్ష్యసాధన విషయంలో స్ఫూర్తి నింపేలా ఈ గీతం సాగుతుందని మేకర్స్ తెలిపారు. మధ్యతరగతి కుటుంబాల సంఘర్షణల నేపథ్యంలో కథ నడుస్తుందని, ప్రేమ, కుటుంబ భావోద్వేగాలు ఇలా అన్ని ఎలిమెంట్స్ ఇందులో ఉంటాయని దర్శకుడు తెలిపారు. శ్రీకాంత్ అయ్యంగార్, శివ చందు, యశస్విని, మొయిన్, మోహిత్, నీల ప్రియా, కాదంబరి కిరణ్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి మాటలు: వినయ్ కొట్టి, కెమెరా: సిద్ధార్థ స్వయంభు.

మనందరి బతుకు చిత్రం

ప్రముఖ నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ తెరకెక్కిస్తున్న చిత్రం 'నరుడి బ్రతుకు నటన'. శివ కుమార్ రామచంద్రవరపు, నితిన్ ప్రసన్న, శృతి జయన్, ఐశ్వర్య అనిల్ కుమార్, వైవా రాఘవ ప్రధాన పాత్రల్ని పోషిస్తున్నారు. రిషికేశ్వర్ యోగి దర్శకుడు. 'షూటింగ్ మొత్తం కేరళలో జరిపాం. అక్కడి ప్రకృతి అందాలు ప్రధానాకర్షణగా నిలుస్తాయి. ఈ సినిమా ఇప్పటికే దాదాపు అరవైకి పైగా అంతర్జాతీయ అవార్డులను గెలుచుకుంది. మన జీవితంలోని జ్ఞాపకాలను గుర్తుచేసే కథాంశమిది. ప్రేమ, స్నేహం, నవ్వు, బాధ...ఇలా అన్ని భావోద్వేగాలతో ఆకట్టుకుంటుంది. ఈ నెల 26న భారీ స్థాయిలో విడుదల చేయబోతున్నాం' అన్నారు.

పన్ను ఆదాకు 10 మార్గాలు



ఆర్థిక సంవత్సరం ముగుస్తోందంటే ఉద్యోగులంతా పన్ను ఆదా ప్రణాళికల కోసం పరుగులు తీస్తారు. ఈక్విటీ లింక్డ్ సేవింగ్ స్కీమ్స్, యూలిప్స్, ఎల్ఐసీ, ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ), హెల్త్ ఇన్సూరెన్స్ అంటూ హడావుడిపడేవాళ్ల సంఖ్య ఈ సీజన్‌లో కాస్త ఎక్కువే. వాస్తవానికి మన ఓవరాల్ ప్లానింగ్‌లో పన్ను ఆదా ఒక భాగంగానే ఉండాలి. కానీ పన్ను తగ్గాలనే ఉద్దేశంతోనే మనం పెట్టుబడులు పెట్టకూడదు. అంతేకాదు ఏడాది మొదట్లోనే మనం ప్లానింగ్ ప్రారంభించాలి. చివరలో చేసే ఏ ప్రణాళికైనా పూర్తిస్థాయి ఫలితాలను ఇవ్వదని తెలుసుకోండి. కాబట్టి వచ్చే ఏడాది నుంచైనా ముందస్తు ప్రణాళిక ఉంటే మంచి వెల్త్ క్రియేట్ చేయడంతోపాటు నాలుగు డబ్బులు ఆదా చేసుకునే వెసులుబాటు ఉంటుంది. ఈ సమయంలో మనకు అందుబాటులో ఉన్న కొన్ని పన్ను మినహాయింపులు చూద్దాం.

1. హౌస్ రెంట్ అలవెన్స్ (హెచ్ఆర్ఏ)

ఉద్యోగి ఇంటి అవసరాలు తీర్చేందుకు సంస్థ.. వాళ్లకు ఇచ్చే అకామిడేషన్ ఖర్చును మనం హౌజ్ రెంట్ అలవెన్స్ కింద పరిగణిస్తాం. ఇది పాక్షికంగా లేదా పూర్తిగా మినహాయింపును పొందొచ్చు. ప్రస్తుతం మీరు ఉంటున్న ఇంటి రెంట్‌ను ఇది కవర్ చేస్తుంది. మీ శాలరీ ప్యాకేజీలో హెచ్ఆర్ఏ ఉన్నప్పుడు, అది కూడా మీరు పాత పన్ను విధానంలో ఉన్నప్పుడే ఈ క్లెయిం చేసుకోగలరు.

2. గృహ రుణ వడ్డీ మినహాయింపు

మీరు గృహ రుణం తీసుకున్నప్పుడు దానిపై చెల్లించే వడ్డీని మినహాయింపుగా పొందవచ్చు. సెక్షన్ 24బీ కింద ఏటా గరిష్ఠంగా రూ.2 లక్షల హోమ్‌లోన్ వడ్డీని డిడక్షన్‌గా పొందవచ్చు. అదే సమయంలో సెక్షన్ 80సీ కింద లక్షన్నరదాకా ప్రిన్సిపుల్ అమౌంట్‌నూ మన ట్యాక్సబుల్ మొత్తం నుంచి మినహాయింపును అందుకోవచ్చు.

3. ప్రభుత్వ స్కీముల్లో పెట్టుబడులు

ప్రభుత్వం అందించే కిసాన్ వికాస్ పత్ర (కేవీపీ), నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ (ఎన్ఎస్‌సీ), పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్) వంటి వాటిల్లో పెట్టుబడులు పెట్టడం వల్ల గరిష్ఠంగా రూ.1.50 లక్షల వరకూ మినహాయింపు పొందే వీలున్నది.

4. లీవ్ ట్రావెల్ అలవెన్స్

తమ ఉద్యోగులు దేశంలో ఎక్కడైనా పర్యటించినప్పుడు చేసే ఖర్చులను ఆయా సంస్థలు లీవ్ ట్రావెల్ అలవెన్స్ (ఎల్‌టీఏ) కింద ఇవ్వవచ్చు. మీతోపాటు కుటుంబ సభ్యులు చేసే విహార యాత్రలు కవర్ అవుతాయి. నాలుగేండ్ల క్యాలెండర్‌లో రెండు ప్రయాణాలకు మాత్రమే ఎల్‌టీఏను క్లెయిం చేసుకోవచ్చు.

5. మీల్ కూపన్స్

సోడెక్సో వంటి మీల్ ఓచర్స్‌ను ఉద్యోగులకు కంపెనీలు ఇస్తాయి. వీటి ద్వారా గరిష్ఠంగా ఏడాదికి రూ.26,400 వరకూ ఎగ్జంప్షన్ పొందవచ్చు.

6. ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్

ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ (ఈపీఎఫ్) కోసం ఉద్యోగులు చేసే కంట్రిబ్యూషన్‌పైనా పాక్షికంగా పన్ను మినహాయింపు పొందవచ్చు. సెక్షన్ 80సీ కింద గరిష్ఠంగా రూ.1.5 లక్షల వరకూ పన్ను మినహాయింపును పొందే వీలుంది.

7. బిల్స్ రీయింబర్స్‌మెంట్

ఎంప్లాయర్స్ రీయింబర్స్‌మెంట్ కింద వీటన్నింటినీ రీయింబర్స్ చేసుకోవచ్చు. అయితే ఇవి సేల్స్‌లో ఉన్నవాళ్లకు వర్తిస్తాయి. అంతేగాక కంపెనీనిబట్టి మిడ్, సీనియర్ లెవెల్ మేనేజ్‌మెంట్‌కు మాత్రమే వర్తించే అవకాశమున్నది.

8. పిల్లల ఎడ్యుకేషన్ అలవెన్స్

గరిష్ఠంగా ఇద్దరు పిల్లలకు ఇది వర్తిస్తుంది. పిల్లల స్కూల్ ఫీజుల నిమిత్తం నెలకు చదువు కోసం రూ.100 మినహాయింపును పొందవచ్చు. హాస్టల్ వసతి కోసం రూ.300 వరకూ మినహాయింపును తీసుకోవచ్చు.

9. స్టాండర్డ్ డిడక్షన్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2018 బడ్జెట్‌లో స్టాండర్డ్ డిడక్షన్‌ను మళ్లీ ప్రారంభించారు. గ్రాస్ శాలరీ నుంచి రూ.50 వేల డిడక్షన్ పొందవచ్చు.

10. మెడికల్ ఇన్సూరెన్స్

సెక్షన్ 80డీ కింద మెడికల్ ఇన్సూరెన్స్ క్లెయిం పొందవచ్చు. పాలసీ తీసుకునేందుకు చెల్లించే ప్రీమియం మొత్తంలో గరిష్ఠంగా రూ.25 వేల వరకూ క్లెయిం తీసుకోవచ్చు. అలాగే మనపై ఆధారపడిన తల్లిదండ్రుల కోసం తీసుకునే పాలసీలపైనా పన్ను ప్రయోజనాలను పొందవచ్చు.

-నాగేంద్రసాయి కుందవరం

గృహ బీమా అంటే?

ఇది ఎలా పనిచేస్తుంది

గృహ బీమాను ప్రాపర్టీ ఇన్సూరెన్స్ లేదా హోమ్ ఓనర్ ఇన్సూరెన్స్‌గా కూడా పిలుస్తారు. ఇది మీ ఇంటికయ్యే ఎక్స్‌టీరియర్-ఇంటీరియర్ డ్యామేజీలను, వాటిల్లే నష్టాలకు కవరేజీనిస్తుంది. ఇంట్లోని వస్తుసామాగ్రికి కూడా బీమా రక్షణ లభిస్తుంది. ఇంట్లో దురదృష్టవశాత్తూ జరిగే ఏదైనా ప్రమాదాలకూ వర్తిస్తుంది.

హోమ్ ఇన్సూరెన్స్ సదుపాయాన్ని పలు కంపెనీలు అందిస్తున్నాయి. వాటిలో ఎస్బీఐ, శ్రీరామ్ జనరల్, బజాజ్ అలియాంజ్, భారతీ యాక్సా, రాయల్ సుందరం, రిలయన్స్, రహేజా క్యూబీఈ, ఓరియంటల్, న్యూ ఇండియా అష్యూరెన్స్, నేషనల్ ఇన్సూరెన్స్, ఫ్యూచర్ జనరాలీ, చోళమండలం వంటి సంస్థలున్నాయి. ఇండ్ల యజమానులు, అద్దెకుండేవారు ఈ బీమాను తీసుకోవచ్చు. కొన్ని సంస్థలు హౌజింగ్ సొసైటీలకూ బీమాను ఇస్తున్నాయి. తీవ్రవాదుల దాడి, భూకంపాల్లో ధ్వంసమైనా బీమాను ఇస్తామని మరికొన్ని సంస్థలు ప్రకటిస్తున్నాయి.

కవరేజీ ఇలా..

షరతులు, ప్రీమియంలనుబట్టి ఆయా సంస్థలు.. అగ్ని ప్రమాదాలు, డాక్యుమెంట్ల నష్టం, దొంగతనాలు, గృహోపకరణాల డ్యామేజీ, వ్యక్తిగత ప్రమాద బీమా, అద్దె ఎగవేత, పెంపుడు జంతువుల సంరక్షణ, ఇల్లు పూర్తిగా దెబ్బతింటే ప్రత్యామ్నాయ వసతి ఖర్చులు, బ్యాగేజీ నష్టం, థర్డ్ పార్టీ-ఎంప్లాయ్ లయబిలిటీస్, ఎలక్ట్రికల్ ఫెయిల్యూర్ కవరేజీలను అందిస్తున్నాయి. ఇంట్లోని విలువైన ఎలక్ట్రిక్-ఎలక్ట్రానిక్ వస్తువులు, ఫర్నీచర్, ఆభరణాలకూ బీమా కవరేజీ ఉంటుంది. ప్రకృతి విపత్తుల్లో ధ్వంసమైనా, అల్లర్లతో ప్రభావితమైనా ఇన్సూరెన్స్‌ను పొందవచ్చు. ఒకవేళ గృహ రుణం పరిధిలో ఇల్లు ఉన్నట్లైతే ప్రీమియంలు అధికంగా ఉంటాయి.



పాలసీ కాలపరిమితి

గృహ బీమా పాలసీలు దీర్ఘకాలానికిగాను కొనుక్కోవచ్చు. అలాగే కనిష్ఠంగా ఏడాది కాలపరిమితితో కూడా తీసుకోవచ్చు. ఇండిపెండెంట్ హౌజ్‌లు, అపార్ట్‌మెంట్లలో ఫ్లాట్లకు అనుగుణంగా ఈ పాలసీల కవరేజీని ఎంచుకోవచ్చు. నివాస ప్రాంతాన్నిబట్టి, పాలసీ వ్యవధి ఆధారంగా ప్రీమియంలుంటాయి. ఎస్బీఐ జనరల్ ఇన్సూరెన్స్ ఇచ్చే హోమ్ ఇన్సూరెన్స్ పాలసీ వ్యవధి కనిష్ఠంగా మూడేండ్లు, గరిష్ఠంగా 30 ఏండ్లుగా ఉన్నది. కాగా, వాటిల్లిన నష్టానికి కారణం ఉద్దేశపూర్వక చర్యేనని తేలితే బీమా వర్తించదు. అంటే బీమా సొమ్ము కోసం కావాలనే నష్టపూరిత చర్యలకు పాల్పడితే అనర్హత వేటు పడుతుంది.

పోస్టాఫీస్ మంత్లీ ఇన్‌కమ్ స్కీం

మదుపరులకు లాభాలివే

సురక్షితమైన పెట్టుబడులను కోరుకునేవారికి పోస్టాఫీస్ మంత్లీ ఇన్‌కమ్ స్కీం ఓ చక్కని అవకాశం. ఇందులో మదుపరికి నెలనెలా వడ్డీ చెల్లింపులుంటాయి. మూడు నెలలకోసారి కేంద్రం వడ్డీరేట్లను సవరిస్తుంది.

ఎవరు అర్హులు?

సింగిల్‌గానైనా, జాయింట్‌గానైనా ఈ స్కీంలో చేరవచ్చు. జాయింట్ అకౌంట్‌లో ముగ్గురిదాకా వీలుంటుంది. మైనర్ల తరపున వారి గార్డియన్లు తీసుకోవచ్చు. అలాగే పదేండ్లు నిండిన మైనర్ సొంతంగా చేరవచ్చు.

పెట్టుబడికి పరిమితి

వెయ్యి రూపాయలకు తగ్గకుండా గరిష్ఠంగా సింగిల్ అకౌంట్‌లో రూ.9 లక్షలు, జాయింట్ అకౌంట్‌లో రూ.15 లక్షలు పెట్టుబడిగా పెట్టవచ్చు. జాయింట్ అకౌంట్‌లో ముగ్గురుంటే ఒకొక్కరు రూ.5 లక్షల చొప్పున పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. ఇక ఖాతా తెరిచిన ఐదేండ్ల వరకే ఈ స్కీం నడుస్తుంది. ఒకవేళ మెచ్యూరిటీ గడువు లోపలే డిపాజిట్‌దారు చనిపోతే నామినీ లేదా చట్టపరమైన వారసులకి సదరు మొత్తాన్ని చెల్లిస్తారు. స్కీం తీసుకున్న ఏడాది-మూడేండ్ల మధ్య కాలంలో ఖాతాను ఉపసంహరించుకుంటే డిపాజిట్ చేసిన మొత్తంలో 2 శాతానికి సమానమైన నగదును కోత పెడుతారు.

వడ్డీరేటు ఇది..

ఈ ఏడాది జనవరి-మార్చి త్రైమాసికానికిగాను వార్షిక వడ్డీరేటు 7.4 శాతంగా ఉన్నది. నెలనెలా దీన్ని చెల్లిస్తారు. మీరు ఖాతా తెరిచిన దగ్గర్నుంచే లెక్క మొదలవుతుంది. అక్కడి నుంచి నెలనెలా ఆదాయం వస్తుంది. ఒకవేళ ఈ ఆదాయాన్ని తీసుకోనట్లైతే.. దీనిపైనా అదనపు ఆదాయాన్ని అందుకోవచ్చు. కాగా, వడ్డీ ఆదాయంపై ట్యాక్స్ పడుతుంది. చాలా పోస్టాఫీస్ పథకాల తరహాలో ఆదాయ పన్ను చట్టం 1961లోని సెక్షన్ 80సీ కింద ఈ మంత్లీ ఇన్‌కమ్ స్కీంకు పన్ను ప్రయోజనాలు అందవు.

ఒడిదొడుకుల్లో..

మార్కెట్ పల్స్

గత వారం స్టాక్ మార్కెట్లు లాభాలతో అదరగొట్టాయి. మదుపరులు పెట్టుబడులకు పెద్దపీట వేశారు మరి. అయితే ఈ వారం లాభాల స్వీకరణకు వీలుందన్న అభిప్రాయాలు మార్కెట్ వర్గాల నుంచి వ్యక్తమవుతున్నాయి. దీంతో లార్జ్, మిడ్, స్మాల్‌క్యాప్ సూచీల్లో ఒకింత అమ్మకాల ఒత్తిడి నెలకొనవచ్చనిపిస్తున్నది. అలాగే చిన్న షేర్లు ఫండమెంటల్స్‌తో సంబంధం లేకుండా కృత్రిమంగా పెరిగిపోతున్నాయని, దీనిని అరికట్టాల్సిందేనంటూ సెబీ చేసిన హెచ్చరికల ప్రభావం స్టాక్ మార్కెట్లపై కొంత మేరకు పడవచ్చు. ఇక గతవారం నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) నిఫ్టీ 20 పాయింట్లు పెరిగి 22,513.70 పాయింట్ల వద్ద నిలిచింది. ప్రధాన షేర్లన్నీ ఆకట్టుకోవడం కలిసొచ్చింది. కాగా, గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, వివిధ అంతర్జాతీయ పరిణామాలు ఈ వారం మార్కెట్ తీరును నిర్దేశించనున్నాయి.

కీలక స్థాయి 22,500

నిఫ్టీకి 22,500 పాయింట్ల స్థాయి కీలకమైనదని, దీన్ని వదులుకోకుండా బుల్స్ ప్రయత్నిస్తుండగా, ఆ స్థాయి దిగువకు దించేందుకు బేర్స్ పట్టుబడుతున్నట్టు సామ్కో సెక్యూరిటీస్ సీఈవో జిమిత్ మోదీ విశ్లేషించారు. నిఫ్టీ 22,000 దిగువన ముగిస్తే 21,800 మద్దతుస్థాయి ముఖ్యమని, ఆ దిగువన 21,700 వరకూ తగ్గవచ్చని జిమిత్ అంచనా వేశారు. రానున్న రోజుల్లో 22,750 స్థాయి గట్టిగా నిరోధించవచ్చన్న అంచనాలున్నాయి.